క్లుప్తంగా

కేంద్ర హోంశాఖ మంత్రిని కలిసిన నాయకులు


ఎంపీ బండి సంజయ్‌తో నాయకులు

ఇల్లందకుంట: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను ఆదివారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో బీజేపీ నాయకులు కలిశారు. మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మట్ట పవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇల్లందకుంట మండల పరిస్థితులు, కనగర్తి గ్రామ అంశాలపై నాయకులు ఎంపీతో చర్చించామని మంత్రి సానుకూలంగా స్పందించారని పవన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి రాజు, ఉప్పుల శ్రీనివాస్‌రెడ్డి, బండి సాంబరాజు, మాడిజోడి రవీందర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

చొప్పదండి: చొప్పదండి మున్సిపాలిటీ పరిధిలో అమృత్ పథకం ప్రారంభించేందుకు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొప్పదండిలో పర్యటించనున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ తెలిపారు. అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫరేషన్ ద్వారా పట్టణాల్లో పునరుజ్జీవన ప్రాజెక్టులను అమలు చేయడంతో మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేసే ఉద్దేశంతో రూ.36 కోట్లతో అమృత్ 2.0 పేరుతో పట్టణ శివారులోని శనిగకుంటలో ఫౌండేషన్ స్టోన్ నిర్మాణానికి కేంద్రమంత్రి హాజరవుతారని బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో వచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి 'అడ్లూరి'కి శుభాకాంక్షలు

హుజూరాబాద్: మంత్రివర్గ విస్తరణలో భాగంగా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ మర్యాద పూర్వకంగా మంత్రిని కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన


మాట్లాడుతున్న హుజూరాబాద్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రాధిక, ఉపాధ్యాయులు

హుజూరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గందె రాధిక అన్నారు. ఉపాధ్యాయులతో కలిసి ఆదివారం బడిబాట ప్రచారం నిర్వహించారు. హుజూరాబాద్ ప్రభుత్వ పాఠశాల పీఎంశ్రీకి ఎంపికైందని అన్నిరకాల సదుపాయాలు పాఠశాలలో ఉన్నాయని తెలిపారు. అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో ప్రాక్టికల్స్ ఆధారంగా బోధన జరుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులకు శిక్షణ

ఇల్లందకుంట: మండలంలోని బుజునూర్, సిరిసేడు గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఆదివారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జమ్మికుంట కేవీకే, వ్యవసాయశాఖ వ్యవసాయ అనుబంధ రంగాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గూర్చి రైతులను వివరించారు. కార్యక్రమంలో కేవీకే వివిధ విభాగాల శాస్త్రవేత్తలు జె.విజయ్, ఆలేటి ప్రశాంతి, వ్యవసాయ విస్తరణ అధికారులు రాకేశ్, మమత తదితరులు పాల్గొన్నారు.

నాయకుల వంటావార్పు


వంటావార్పులో బ్రిడ్జి జేఏసీ నాయకులు

గన్నేరువరం: గన్నేరువరం నుంచి కరీంనగర్ వరకు మానేరుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ కోరారు. మైలారం మైసమ్మ గుట్ట వద్ద ఆదివారం వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. కంటికి దగ్గరగా కాలుకు దూరంగా జిల్లా కేంద్రం ఉందని, బ్రిడ్జి నిర్మాణం చేపడితే మూడు మండలాల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఆయా పార్టీలు ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని, లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవీందర్, సతీష్, రామచంద్రం, ప్రశాంతి యాదవ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇటు పూర్తికాలే.. అటు పంపిణీ చేయలే

- అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- కొన్ని గ్రామాల్లో నిర్మించినా కూలిపోతున్న వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా
- హుజూరాబాద్ నియోజకవర్గంలో రూ.66 కోట్ల ప్రజాధనం వృథా
- స్థానిక ఎన్నికలలోపు అర్హులకు ఇవ్వాలంటున్న ప్రజలు


చిన్నకోమటిపల్లిలో అసంపూర్తిగా ఇళ్లు (ఇన్‌సెట్లో) కోర్కల్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు

వీణవంక: నిరుపేదలకు గూడు కట్టించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. హుజూరాబాద్, ఇల్లందకుంట, జమ్మికుంట, వీణవంక మండలాల్లో ఇళ్ల నిర్మాణానికి ఏడేళ్ల క్రితం రూ.66 కోట్ల నిధులు మంజూరయ్యాయి. హుజూరాబాద్‌లోని సిర్సపల్లి రోడ్డులో ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారుల ఎంపిక అటెక్కక్కింది. జమ్మికుంట పట్టణంలోని కొత్త మార్కెట్ ఏరియాలో ఇళ్ల దుస్థితి అంతే. ఇల్లందకుంట, వీణవంక మండలాలలో బిల్లులు రావడంలేదని కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని నిరుపేదలు ఇళ్ల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ ఓడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వమైన అర్హులకు కేటాయిస్తారని ఎదురు చూశారు. కానీ ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఇళ్లను పరిశీలించారు. అర్హులకు కేటాయించేలా చర్యలు చేపడతామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. నిర్మించిన వి పంపిణీ చేస్తే కొంత మందికి న్యాయం జరగనుంది.

నియోజకవర్గంలో ఇళ్ల మంజూరు

జమ్మికంట 500, హుజూరాబాద్ 500, ఇల్లందకుంట 111, వీణవంకకు 95 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 784 ఇండ్ల నిర్మాణం పూర్తికాగా మిగిలిన ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని అధి కారుల లెక్కలు చెబుతున్నాయి. అర్బన్ ప్రాంతంలో ఒక్కో ఇళ్లకు రూ.5.30 లక్షలు, రూరల్ ప్రాంతంలో రూ.5.04 లక్షల నిధులు కేటాయించారు. హుజూరాబాద్‌లో 500 ఇళ్లు పూర్తికాగా లబ్ధిదారుల ఎంపిక జరగడంలేదు. ఇళ్ల తలుపులు, కిటికీలను ఆకతాయిలు ధ్వంసం చేస్తున్నారు. అంతేగాక మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో 20 ఇళ్లు మంజూరు కాగా ఇందులో పది ఇళ్లు స్లాబ్‌లెవల్ వరకు పనులు జరిగాయి. కొన్ని ఇళ్ల గోడలు కూలిపోయాయి. మరికొన్ని శిథిలావస్థలోకి చేరుకున్నాయి. ముళ్లపొదలు ఇళ్లను మించి పెరిగిపోయాయి. కోర్కల్‌లో ఇళ్ల లబ్ధిదారులకు ఇవ్వడంలో అధికారులు చేతులెత్తేశారు. కిటికీలు, తలుపులను ఆకతాయిలు పగలగొట్టారు. పేకాటరాయుళ్లకు ఇళ్లు స్థావరమైంది. ఇల్లందకుంట మండలంలో ఇదే పరిస్థితి. డబుల్ బెడ్రూం ఇళ్లు ఊరికి చివరి నిర్మంచడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పోలీసుల నిఘా లేకపోడంతో మందుబాబులు పెట్రేగిపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి లబ్ధిదారులకు ఇళ్లు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇళ్ల పరిస్థితి

మండలం	ఇళ్లు	నిర్మించినవి	అసంపూర్తిగా
వీణవంక	95	40	55
ఇల్లందకుంట	111	52	59
జమ్మికుంట	500	152	348
హుజూరాబాద్	500	500	00

శిథిలావస్థకు ఇళ్లు

ఇళ్లు నిర్మించినా ఇప్పటి వరకు పేదలకు ఇవ్వలేదు. ప్రస్తుతం ఇళ్లు శిథిలావస్థలోకి చేరుతున్నాయి. వీణవంకలోని కోర్కల్, పోతిరెడ్డిపల్లిలో ఇదే దుస్థితి. నిర్మించిన ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా వృథాగా ఉండటం వల్లన ఇళ్లు కూలిపోయే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పేదలకు ఇళ్లు ఇస్తే బాగుంటది. ప్రజాప్రతినిధులు స్పందించి పేదలకు ఇళ్లను పంపిణీ చేయాలి. అసంపూర్తి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

సంపత్, వీణవంక మండలం


జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన రోడ్డుపై గుంత ఏర్పడింది. బ్రిడ్జి దిగే క్రమంలో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్, ఆర్‌అండ్‌బీ డీఈ, సెల్ నం : 94408 18419

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



అ'పూర్వ' సమ్మేళనం

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004–05 పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇరవై ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో శ్రీసరస్వతీ మాత విగ్రహాన్ని చదువు చెప్పిన టీచర్లతో కలిసి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. టీచర్లు మధునయ్య, జగన్మోహన్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సంపత్, విజయలక్ష్మి, శ్రీనివాస్, పద్మావతి, రమేష్, రావుల రాజేశం, లక్ష్మీనారాయణ, విద్యార్థులు మోటపోతుల తిరుపతి, అనగోని రాజు, గొల్లపల్లి శ్రీకాంత్, కురుమిళ్ల రాజు, కనుకుల రాజు, బీనవేన కుమార్, మర్రి తిరుపతి, కిరణ్, మల్లేష్, కిషన్, ఎర్రం రాము, కోడం రాజేశ్వర్‌రావు,సింగిరెడ్డి సుమలత,మమత, సతీష్, సురేష్, సమ్మయ్య, భోగం రమేష్, సాయిరాం, బొమ్మిడి రాజేందర్, దిడ్డి ప్రియాంక, దాసరి స్వప్న, మానస, ప్రశాంతి, కళ్యాణి, మమత పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మడేలేశ్వర విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నంలో మడేలేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ మునిగాల సుదీష్ణ సుధాకర్‌గౌడ్ దంపతులు ఆలయానికి విగ్రహాలను బహూకరించారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పడుమటి నర్సయ్య, పడమటి మల్లయ్య, ముసపురి తిరుపతి, రాజేశం, లచ్చయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ బోనాలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామస్తులు ఆదివారం నల్ల పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 17 కుల సంఘాల ఆధ్వర్యంలో మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భూమిపూజ

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయ నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి నాదివారం ఆలయ కమిటీ సభ్యులు భూమి పూజ చేశారు. ఆలయానికి కొద్ది దూరంలో సత్రం నిర్మిస్తున్నామని దాతలు తమవంతు విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డాక్టర్ బద్దం తిరుపతిరెడ్డి, సింగిరెడ్డి లచ్చిరెడ్డి, కల్లెపల్లి దుర్గయ్య, బద్దం మల్లారెడ్డి, బొజ్జ నాగయ్య, బద్దం తిరుపతిరెడ్డి, కర్రె చంద్రయ్య, కనుకయ్య, ఎల్లయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


రామడుగు: గోపాల్‌రావుపేటలో బోనాలతో వెళ్లుతున్న మహిళలు


చొప్పదండి: విగ్రహదాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు సంతృప్తి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిగురుమామిడి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు సంతోషంగా ఉన్నారని మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్ అన్నారు. ఆదివారం చిగురుమామిడిలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆయా పార్టీల నాయకులు ఆరోపించడంలో అర్థం లేదన్నారు. చిన్నముల్కనూర్‌లో తప్పా ఏ గ్రామంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్లు నిర్మించలేదన్నారు. సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు పూల లచ్చిరెడ్డి, బదుకోలు దేవేందర్‌రెడ్డి, పూదరి వేణుగోపాల్, అందె సురేశ్, గట్టు ప్రశాంత్, బొమ్మగాని వెంకటేశం, మార్క రాజు, కవ్వంపల్లి సంజీవ్ పలువురు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన తొర్రికొండ రాజవ్వ(76) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మానకొండూర్ సీఐ సంజీవ్ తెలిపిన వివరాలు.. రాజవ్వ నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. అనారోగ్యం, జీవితంపై విరక్తితో చెంది ఆదివారం ఇంటి సమీపంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కూతురు రాజేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.


చిగురుమామిడి: ముగ్గుపోస్తున్న నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 8వ వార్డు, మండలంలోని నాగారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేసి, ఇంటి నిర్మాణ పనులకు ముగ్గు పోశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందని, పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తో నెరవేరుతుందన్నారు. మార్కెట్ చైర్ పర్సన్ స్వప్న, ఇందిరమ్మ ఇళ్ల సొసైటీ అధ్యక్షురాలు కవిత, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ డైరెక్టర్ కుతుబుద్దీన్, మాజీ ఉపసర్పంచ్ ముంజ శిరీషప్రకాశ్ ముగ్గు పోశారు. సకాలంలో ఇళ్లు నిర్మించుకొని ప్రభుత్వం నుంచి లబ్ధిపొందాలని కోరారు. నాయకులు జగన్, ముంజ వెంకన్న, బొంగోని శ్రీనివాస్, అజయ్, మునీందర్, పలువురు పాల్గొన్నారు.


జమ్మికుంట: బట్టలు పెడుతున్న నాయకులు

మహేందర్‌కు జ్యోతిష్య శిఖామణి పురస్కారం

కరీంనగర్‌రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు శ్రీనివాస జ్యోతిష్య పరిశోధన, వైద్య జ్యోతిష్య, వాస్తు శాస్త్ర అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో దుర్శేడ్‌కు చెందిన వేముల మహేందర్‌కు జ్యోతిష్య శిఖామణి అవార్డును ప్రదానం చేశారు. జ్యోతిష్యశాస్త్రంలో మహేందర్ చేసిన విశేష సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సంస్థ ఫౌండర్ కుముదవల్లి సముద్రాల, ఆచార్య సముద్రాల, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు స్పందన

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ అస్త్ర కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం తెలంగాణ విద్యా సమితి, టెక్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించింది. ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసిన ప్రసన్న హరికృష్ణ ప్రారంభించగా.. తెలంగాణ విద్యాసమితి రాష్ట్ర అధ్యక్షుడు తారక్‌గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి పాల్గొన్నారు.

ఆరుగురిపై అట్రాసిటీ కేసు

జమ్మికుంట: పెళ్లి భోజన సమయంలో గొడవ పడి కులం పేరుతో దూషించిన ఆరుగురిపై ఆదివారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ తెలిపారు. మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన జూపాక పల్లవి, ఇల్లందకుంట మండలం బూజునూరు గ్రామానికి చెందిన తోడేటి అజయ్‌గౌడ్‌కు పెద్దల సమక్షంలో పెళ్లి జరిపించారు. భోజనాలు చేస్తుండగా బూజునూరు గ్రామానికి చెందిన మాచర్ల రాకేశ్, మామిడి సాయికుమార్, కొత్వాల కళ్యాణ్, తోడేటి పవన్, రౌతు రాకేష్, ఇల్లందుల రమేశ్ గొడవ చేసి జూపాక హరీశ్, పవన్‌కళ్యాణ్‌ను కులం పేరుతో దూషించారు. బాధితుల అన్న జూపాక ప్రశాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

వేధింపులకు పాల్పడిన యువకుడిపై..

యువతిపై వేధింపులకు పాల్పడిన ఓ యువకుడిపై ఆదివారం కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ముస్లిం యువతి కుటుంబంతో కలిసి మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు హాజరైంది. ఓ యువకుడు ఆమెను వెంబడిస్తూ వేధింపులకు పాల్పడ్డాడని బాధితురాల అన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.


కలెక్టరేట్ ఎదుట డిమాండ్ల సాధనకు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ కార్యకర్తలు(ఫైల్)

అంగన్‌వాడీలకు తీపి కబురు

- 65 ఏళ్లు నిండితే ఉద్యోగ విరమణ
- ప్రయోజనాలు పెంపు
- టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష
- ఫలించిన అంగన్‌వాడీ యూనియన్ల పోరాటం

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు తీసుకుంటోంది. టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలను పెంచుతూ ఆర్థిక శాఖ అనుమతులు జారీ చేసింది. విరమణ ప్రోత్సాహకాలను రెండింతలు చేస్తూ అనుమతులిచ్చింది. దీంతో టీచర్లు, ఆయాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విరమణ సమయంలో టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున అందించనున్నారు. జిల్లాలో నాలుగు ప్రాజెక్టు పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 68 టీచర్లు, 200 ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయి.

జిల్లాలో నాలుగు ప్రాజెక్టులు

జిల్లాలో కరీంనగర్‌అర్బన్, కరీంనగర్‌రూరల్, గంగాధర, హుజూరాబాద్ అంగన్‌వాడీ ప్రాజెక్టులున్నాయి. వాటి పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల ద్వారా అంగన్‌వాడీ టీచర్లు గ్రామీణ ప్రాంత చిన్నారులు, తల్లులు, గర్భిణులకు తగిన సహాయ సహకారాలు అందిస్తున్నారు. జిల్లాలో గర్భిణులు 3600, బాలింతలు 4663, 0–6 నెలల వయస్సు ఉన్న చిన్నారులు 10,377 మంది ఉన్నారు. వీరంతా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పోషకాహారం, తదితర వాటితో లబ్ధిపొందుతున్నారు.

ఖాళీల భర్తీకి చర్యలు

జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీకి ఐసీడీఎస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. టీచర్లు, ఆయాల పోస్టుల ఎన్ని ఖాళీగా ఉన్నాయనే వివరాలు సేకరించి అధికార యంత్రాంగానికి నివేదించారు. ఈ రెండు పోస్టులకు కనీస విద్యార్హత ఇంటర్ పాసై ఉండాలి. వయసు 18–35 ఏళ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపింది. పోస్టుల భర్తీ ఎలా చేయాలనేది నిర్ణయించలేదు. గతంలో మార్కుల ఆధారంగా భర్తీ చేసేవారు.

మా పోరాట ఫలితమే



మా పోరాట ఫలితంగానే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాన్ని ప్రభుత్వం రెండింతలు చేసింది. ఉత్తర్వులు 2024 జూలై 1 నుంచి వర్తింపజేయాలి. ఖాళీలను భర్తీ చేయాలి. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసే దిశగా ప్రయత్నం చేయాలి.

– ఎడ్ల రమేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి